సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



కంచర్లలో కంటివెలుగు

వీర్నపల్లి(సిరిసిల్ల): కంచర్లలో కంటివెలుగును సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ రజిత, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ ఉన్నారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికశాతం ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా, రాత్రి చలిగా ఉంటుంది.

తల్లి పాదాల కింద స్వర్గం ఉంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.34	బుధ 4.36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

దాహం తీర్చడం అభినందనీయం



కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభిస్తున్న జడ్జి సట్టు రవీందర్

వేములవాడ: ఎండాకాలంలో కోర్టుకు వస్తున్న వారి దాహం తీర్చడం అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, విద్యాసాగర్‌రావు, అంజయ్య, రజనీకాంత్, సుజీవన్, సుజాత, నయిమానాసరి, సరిత పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం సహకరించాలి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: నేతకార్మికులను యజమానులు చేసేందుకు అమలు చేసే 'వర్కర్ టు ఓనర్' పథకంలో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని సీపీఐ పట్టణ, లాల్‌బాహుటా చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సిరిసిల్ల శివారులో ఏర్పాటు చేస్తున్న వర్కర్ టు ఓనర్ పథకం షెడ్లను సోమవారం సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి పరిశీలించి మాట్లాడారు. యూనిట్ విలువలో యాభైశాతం సబ్సిడీని కేంద్రం అందించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతకార్మికులకు ఒరగబెట్టిందేమీ లేదని, ఈ పథకంలోనైన కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరారు. కడారి రాములు, మంచికట్ల రమేశ్, రామన్న, సోమ నాగరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ అందివ్వాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలు నేసే కార్మికులకు ఇవ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీని వెంటనే అందివ్వాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. 2020 నుంచి ఇప్పటి వరకు చీరల ఉత్పత్తికి సంబంధించిన సబ్సిడీ కార్మికులకు అందలేదన్నారు. 2023కు సంబంధించిన ఆర్డర్లు ఇస్తున్న నేపథ్యంలో పాత బకాయిలు చెల్లించాలని కోరారు. నక్క దేవదాసు, గుండు రమేశ్, శ్రీపతి మునీందర్, సబ్బని చంద్రకాంత్ పాల్గొన్నారు.

'గురుకుల'ను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలోని పట్టణ గురుకుల పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పర్శురాములు, వెన్నెల, నర్సింలు, భూమేశ్ ఉన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం

- ఆక్వాహబ్‌లో స్థానికులకు ఉపాధి
- మధ్యమానేరు నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- 65 ఏళ్లలో జరగని అభివృద్ధి 8 ఏళ్లలో చేశాం
- మంత్రి కె.తారక రామారావు



తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. జిల్లాలోని తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో సోమవారం పర్యటించిన సందర్భంగా నిర్వహించిన సభల్లో మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, డంపుయార్డులు, క్రీడాప్రాంగణాలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, రైతువేదికలు, కేసీఆర్ ప్రగతి ప్రాంగణాలు ఉన్నాయన్నారు. దేశంలోనే 20 ఉత్తమ గ్రామపంచాయతీలలో తెలంగాణలోనే 19 ఉన్నాయని వివరించారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి మనపైన కోపం ఉన్నా.. మన పల్లెల్లో ప్రగతి చూసి అవార్డులు ఇవ్వక తప్పడం లేదన్నారు. మధ్యమానేరులో 350 ఎకరాల్లో ఆక్వాహబ్ ఏర్పాటవుతుందని, చేపలపెంపకం ద్వారా చీర్లవంచ, చింతలఠాణా యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మధ్యమానేరు జలాశయం మన హయాంలో చేపట్టకపోయిన పూర్తి చేశామన్నారు. ముంపు బాధితులకు ఎవరికైనా పట్టాలు రాకుంటే ఇప్పిస్తామని, 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీలు రాకుంటే వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. 65 ఏళ్లలో జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలను 8 ఏళ్లలో చేసి చూపించామని వివరించారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయే తప్ప.. నిజానికి విమర్శించడానికి ఏమీ లేదన్నారు. విమర్శించే ప్రతిపక్ష నాయకులకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు.

దళితబంధు అద్భుతం

పేదరికాన్ని శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రారంభించారని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 40వేల కుటుంబాలకు ఈ పథకంలో ప్రయోజనం దక్కిందన్నారు. జిల్లాలో ఇద్దరు, ముగ్గురు కలిసి రైస్‌మిల్లును, పెట్రోల్‌బంక్‌ను, పౌల్ట్రీఫామ్‌ను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. ఉచితంగా కంటిపరీక్షలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఇంకా ఎవరికైనా ఆసరా పెన్షన్లు రాకుంటే ఇస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరికీ ఆరాధ్యుడు



గోరింట్యాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆరాధ్యుడని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం గోరింట్యాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమీకరించు, బోధించు, పోరాడు.. స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నామన్నారు. గోరింట్యాల ఎర్రగుంట చెరువును నింపుతామని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు మంజూరు చేస్తామని, 60లక్షలతో కాజీవే పనులు ప్రారంభిస్తామని, ముదిరాజ్, అంబేడ్కర్, మున్నూరుకాపు, గౌడసంఘం భవనాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, జెడ్పీటీసీ విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోడుభూముల సమస్య పరిష్కరిస్తాం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తండాలను గ్రామపంచాయతీలుగా చేయాలన్న గిరిజనుల కల నెరవేర్చిన ఘతన సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో సోమవారం జీపీ భవనం, గిరిజన కమ్యూనిటీ భవనం, దుమాలలో చిట్టివాగుపై వంతెన ప్రారంభం, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొంటున్న పోడుభూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గిరిజనుల రిజర్వేషన్‌ను 6 నుంచి 10 శాతానికి పెంచామని, తండాలను పంచాయతీలుగా మార్చడంతో 3 వేల మంది సర్పంచులు, 20 వేల మందిని వార్డుసభ్యులుగా చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2వేలకు పెంచుకున్నామన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచులు కదిరె రజిత, అజ్మీరా రజిత, భూక్య శంకర్ నాయక్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ పాల్గొన్నారు.



బుగ్గరాజేశ్వరతండాలో జీపీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

శంకుస్థాపనలు.. ఆవిష్కరణలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ సోమవారం తంగళ్లపల్లి మండలంలోని చీర్లవంచ, గోపాలపల్లె, మండెపల్లి గ్రామాల్లో అంబేడ్కర్, చీర్లవంచలో చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించి, ఎస్సీ, ముదిరాజ్ కమ్యూనిటీహాల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీపూర్‌లో హెల్త్ సబ్‌సెంటర్, పాపయ్యపల్లెలో పంచాయతీ భవనం, తంగళ్లపల్లిలోని పీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించారు. గంగా పరమేశ్వరుడి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. గండిలచ్చపేటలో దళితబంధు పథకంలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీఫామ్‌ను ప్రారంభించారు. మండెపల్లిలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తుండగా గ్రామానికి చెందిన రైతు తిరుపతిరెడ్డి రుణమాఫీ చేయలేదని ప్రశ్నించగా.. పోలీసులు అక్కడి నుంచి లాక్కెళ్లారు. మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్ర భుత్వం రైతుబంధు, రైతుబీమా ఇస్తోందని, క రోనాకు ముందు చేసిన రైతు రుణమాఫీని గుర్తుచేశారు. సర్పంచులు జక్కుల నాగరాజు, మిట్టపల్లి పద్మ, నక్క రేవతి, అంకారపు అనిత, గణప శివజ్యోతి, నీరటి లక్ష్మి, ఎంపీపీ పడిగెల మాన స, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, ఎంపీడీవో పి.లచ్చాలు, వెటర్నరీ డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫస్ట్ తారీఖున పెన్షన్ ఇవ్వాలి

- ఆదాయపు పన్ను మినహాయించాలి
- జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బలరాములు



ఆర్డీవో ఆఫీసు ఎదుట నల్లబ్యాడ్జీలతో రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్ష

సిరిసిల్లటౌన్: ప్రతీ నెల ఫస్ట్ తారీఖునే పెన్షన్‌లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు బలరాములు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా బలరాములు మాట్లాడుతూ తమకు రావాల్సిన మూడు నెలల కరువుభత్యం వెంటనే చెల్లించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందివ్వాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జూలై నుంచి పీఆర్సీ రావాల్సి ఉన్నందున వెంటనే కమిటీని నియమించాలని, రైల్వేప్రయాణాల్లో రాయితీ అందించాలని కోరారు. ఈమేరకు కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి చొకి సుధాకర్, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు టీవీ లక్ష్మణ్‌రావు, కార్యదర్శి మోహన్‌రావు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతోనే గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని వట్టిమల్లలో రెండు రోజులుగా కొనసాగుతున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచ్ కొమ్ము స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, మరిమడ్ల సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

తరలిపోతున్న ప్రాజెక్టు మట్టి



ట్రాక్టర్లతో పరారవుతున్న అక్రమార్కులు

వేములవాడరూరల్: మర్రిపల్లి రిజర్వాయర్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టి తరలింపు కొన్ని రోజులుగా సాగుతోందని తెలుస్తోంది. సోమవారం సైతం భారీ ఎత్తున మట్టి తరలిస్తున్నట్లు అధికారులకు తెలియడంతో వెంటనే అక్కడికి వెళ్లారు. అధికారుల రాకను గమనించిన అక్రమార్కులు ట్రాక్టర్లతో సహ అక్కడి నుంచి పరారయ్యారు. రిజర్వాయర్ పూర్తి చేసి ఎల్లంపల్లి నీరును నింపితే ఈ ప్రాజెక్టు ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. కానీ గతేడాదిగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. ఇదే ఆసరాగా చేసుకున్న కొందరు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే బహిరంగంగా పట్టపగలు మట్టిని తరలిస్తుండడం విస్మయానికి గురిచేస్తుంది.

ప్రజావాణి ఆలకించండి

- భారీగా తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన ఆర్డీవో పవన్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పవన్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై సత్వర పరిష్కారం చూపాలని వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు అధికారులతో మొరపెట్టుకున్నారు. తమ సమస్యలు ఆలకించి.. పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ప్రజావాణికి మొత్తం 49 దరఖాస్తులు వచ్చాయి.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి



వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు. పల్లె ప్రకృతి వనం, హరితహారం, ట్రాక్టర్ డీజిల్ మెయింటనెన్స్, సీసీరోడ్లు, డ్రెయినేజీలు సంబంధిత నిధులు దుర్వినియోగం చేస్తున్నాడు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, ఇష్టానుసారంగా తీర్మానాలు చేసుకుంటున్నాడు. ఈ విషయంపై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. సర్పంచ్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. – మధుకర్, ఫాజులనగర్ వాసి

పెన్షన్ ఇప్పించండి



మాది సిరిసిల్ల పట్టణం. మా కొడుకు గాజుల బన్ని పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. కనీసం నడవలేని పరిస్థితి. అధికారులు వైకల్యశాతం సర్టిఫికెట్ మంజూరు చేశారు. మా కొడుకుకు ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని చాలా సార్లు అధికారులకు విన్నవించిన. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా కొడుకుకు ఆసరా పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలి.– గాజుల బన్ని తల్లిదండ్రులు

మాయం చేశారా?

- మాయమయ్యాయా?
- మిస్సయిన స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు!
- ఐదు గంటలపాటు అధికారుల అవస్థలు



స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరిచేందుకు యత్నిస్తున్న అధికారులు

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఉందని కొందరు, సాంకేతిక కారణాలు ఉండొచ్చని అధికారులు, కావాలనే ఇలా చేస్తున్నారని బాధితుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరస్పర ఆరోపణలకు దిగడం ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. అయితే, తాళపు చెవులు కావాలనే మార్చారా? లేక మాయం చేశారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరించారా? లేక మరేదైనా కారణం ఉందా? అనేదానిపై జిల్లావ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

వివాదాస్పదమైన స్వల్ప ఆధిక్యం..

ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌ను మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై టీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్వల్ప ఆధిక్యం (441 ఓట్ల మెజారిటీ)తో గెలుపొందారు. అయితే, కౌంటింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు అవసరమైన డాక్యుమెంట్లను హైకోర్టుకు మంగళవారం సమర్పించాల్సి ఉంది.

స్ట్రాంగ్‌రూముల్లో ఏముంది?

- మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్‌కాలేజీ(మూతపడ్డది)లోని మూడు గదుల్లో ఎన్నికల సామగ్రి భద్రపర్చారు.
- మొదటి గదిలో 001 నుంచి 107వ నంబరు వరకు, రెండోగదిలో 108 నుంచి 269వ నంబరు వరకు ఈవీఎంలు భద్రపర్చారు.
- మూడోగదిలో సీసీ కెమెరాలు, సీసీ ఫుటేజీలు, వీవీప్యాడ్లు, పలు డాక్యుమెంట్లు, ఇతర ఎన్నికల సామగ్రి ఉంచారు.
- సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో మొదటి, రెండో గది తాళాలు తీయగా, అందులోని ఈవీఎంలు కనిపించాయి.
- ఆ తర్వాత మూడోగది తాళం తీసేందుకు యత్నించగా అది మొరాయించింది.
- ఇక్కడే అసలు సమస్య మొదలైంది. మూడోగది తాళపు చెవి పనిచేయలేదా? లేక దానిస్థానంలో మరోటి తీసుకొచ్చారా? కావాలనే ఎవరైనా ఇలా చేశారా? లేక సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

అధికారుల అవస్థలు..

కోర్టు అడిగిన 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్ల కోసం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, అప్పటి ఎన్నికల అధికారి భిక్షపతి సోమవారం నూకపల్లి వెళ్లారు. అక్కడి మొదటి స్ట్రాంగ్‌రూమ్ తాళాన్ని 786006 నంబరు 'కీ'తో తెరిచారు. రెండోగది తాళాన్ని కూడా 786402 నంబరు 'కీ'తో తెరిచారు. కానీ, 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్లు భద్రపర్చిన గది తాళాన్ని 786051 నంబరు 'కీ'తో తెరిచేందుకు యత్నించినా అది ఎంతకూ ఓపెన్ కాలేదు. దాదాపు ఐదు గంటలపాటు అధికారులు నానాతంటాలు పడినా తాళం తెరుచుకోలేదు. దీనిపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతినెలా 3వ తేదీన తనిఖీ

స్ట్రాంగ్‌రూమ్ గదులను ప్రతి నెలా మూడోతేదీన కలెక్టర్ నేతృత్వంలో అధికారులు తనిఖీ చేస్తూ ఉన్నారు. తొలుత 2018లో అప్పటి కలెక్టర్ శరత్ ప్రతినెలా మూడోతేదీన స్ట్రాంగ్‌రూములు తనిఖీ చేశారు. ఆ తర్వాత గుగులోతు రవి, ప్రస్తుతం షేక్ యాస్మిన్ బాషా కూడా తరచూ గదులు తనిఖీ చేస్తున్నారు. కానీ, ఎవరూ తాళాలు తెరిచిచూడలేదు. కలెక్టర్లు బదిలీపై వెళ్లిన ప్రతీసారి ఇక్కడకు వచ్చే కలెక్టర్‌కు స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు అప్పగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒకగది తాళపు చెవి పనిచేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తేనేటీగల దాడి..

వీఆర్‌కే కళాశాల వద్ద ఉన్న అధికారులు, పాత్రికేయులపై తేనెటీగలు దాడిచేశాయి. దీంతో అధికారులు కాలేజీ నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు కార్ల డోర్లు తెరిచి లోనికి వెళ్లగా, మరికొందరు దూరంగా పరుగులు తీశారు. చాలారోజులుగా కాలేజీ మూసి ఉండడంతో భవనం చుట్టూ తేనెతెట్టులు ఏర్పాటు చేసుకున్నాయి. జనం రద్దీ అధికం కావడంతో తేనెటీగలు దాడిచేసినట్లు అక్కడికొచ్చిన వారు భావిస్తున్నారు.

'అడ్లూరి' ఆందోళన

- మూడోగది(స్ట్రాంగ్‌రూమ్) తాళం తెరుచుకోకపోవడంపై కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాళం పగులగొడతామని ఉన్నతాధికారులు చెప్పడంతో అడ్లూరి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాక తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. దీంతో ఐదుగంటలపాటు అధికారులు నిరీక్షించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. తాళంచెవి ఉన్నా.. తాళం రావడంలేదని, ఈ విషయాన్నే హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ తరఫున డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, అడ్వొకేట్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే తాళాలు తెరిచే ప్రక్రియ చేపట్టారు.

దుర్గమ్మకు అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మకు సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు విజయ్ అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరను సోమవారం సమర్పించారు. బంగారం, వెండి జరీతో నేసిన ఈ చీరకు ప్రత్యేక పూజలు చేశారు. విజయ్ మాట్లాడుతూ ఐదు గ్రాముల బంగారం, పది గ్రాముల వెండిని ఉపయోగించి నాణ్యమైన పట్టు దారాలతో ఈ చీరను నేసినట్లు తెలిపారు. దీని బరువు సుమారు 100 గ్రాములు ఉంటుందని వివరించారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల ముందస్తు అరెస్ట్



సిరిసిల్ల అర్బన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తారన్న సమాచారంతో వైఎస్సార్‌టీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి వైఎస్సార్‌టీపీ నాయకులు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అరెస్ట్‌చేసి ఠాణాకు తరలించారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ..మంత్రి పర్యటన ఉన్న ప్రతిసారి ముందస్తు అరెస్టులు చేయడం ఆపాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించకుండా అరెస్టుల పర్వం కొనసాగుతుందని ఆరోపించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో దొమ్మాటి నర్సయ్యతో పాటు నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ని బాబు, మానుక నాగరాజు, బానోతు రాజునాయక్, సుడిది, రాజేందర్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న జనరల్ కో ఆర్డినేటర్ పద్మజ, ఎంఈవో

రుద్రంగి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జనరల్ కో ఆర్డినేటర్ పద్మజ, ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేసి భవనాన్ని విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేజీబీవీ ఎస్‌వో మంకు వనిత, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

ముస్తాబాద్ (సిరిసిల్ల): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరినేని రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రొబెషనరీ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో జారీచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అభివృద్ధి పనులను చేస్తున్నారని, తక్కువ వేతనాలకు పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో కార్యదర్శులదే కీలకపాత్ర అని గుర్తుచేశారు.

కొనసాగుతున్న 'ఆధార్' అప్‌డేట్

- గతంలో డాక్యుమెంట్స్ లేకుండానే ఆధార్
- అప్‌డేట్‌తో బోగస్ ఆధార్ కార్డుల ఏరివేతతో పాటు సవరణలకు అవకాశం
- ఆగస్టు 31లోగా గడువు


స్తంభంపల్లిలో ఆధార్ అప్‌డేట్ క్యాంపు

బోయినపల్లి (చొప్పదండి) : ఆధార్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ వారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లాలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతోంది. 2010 నుంచి 2016 వరకు ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకోకుండానే ఆధార్ కార్డు ఇచ్చారు. బోగస్‌కార్డుల ఏరివేతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ ఉన్న ప్రతిపౌరుడు తమ పేరు, అడ్రస్‌ను సరైన ఆధారాలతో ఆధార్ ధ్రువీకరణ చేయించుకోవాలని పేర్కొంది.

గ్రామాల్లో కేంద్రాలు..

జిల్లాలో సుమారు 30 వరకు ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆధార్ కేంద్రాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం ఆధార్ అప్‌డేట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా రెండు నుంచి మూడ్రోజులు ఆధార్ అప్‌డేట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మేనేజర్ మహేశ్ తెలిపారు.

2016 తర్వాత ..

2010 నుంచి 2016 మధ్యలో ఆధార్‌కార్డు పొందినవారు 2016 తర్వాత ఆధార్‌లో తమ పేరు లేదా అడ్రస్‌ను మార్చుకోపోతే ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధార్‌లో ఉన్న అడ్రస్, ఇపుడు ఉంటున్న అడ్రస్ వేరుగా ఉంటే తగిన ఆధారాలు చూపి అప్‌డేట్ చేయించుకోవాలి. పెళ్లి తర్వాత అమ్మాయిలు చిరునామా మార్చుకోవాలంటే వివాహ ధ్రువపత్రం చూపించి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి.

సవరణలకు వీలు

ఆధార్ అప్‌డేట్‌తో పలు సవరణలు చేసుకునే వీలు ఉంది. చిన్నారులకు జనన ధ్రువీకరణ ఆధారంగా పుట్టిన తేదీ ఆధార్‌లో నమోదు చేస్తారు. మిగతా వారికి ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించాలి. ఆధార్‌లో పుట్టిన తేదీ ఒకసారి మాత్రమే సవరించుకునే అవకాశం ఉంది. రెండోసారి సవరించుకోవాలంటే హైదరాబాద్‌లోని యూఐడీఏఐ కార్యాలయంలో తగిన ఆధారాలతో సంప్రదించాలి. పేరులో తప్పులు సవరించాలంటే ఫొటోగుర్తింపు ఉన్న ధ్రువపత్రాలు సమర్పించాలి. ఎస్సెస్సీ మెమో, ఓటర్ ఐడీ, పాన్‌కార్డు, ఉద్యోగుల గుర్తింపు కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలి. చిరునామాలో మార్పులు ఉంటే తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ధ్రువపత్రం సమర్పించాలి, విద్యార్థులకు హెడ్‌మాస్టర్ ధ్రువీకరణ సరిపోతుంది.

సర్వీసులు నిలిపివేత

2010 నుంచి 2016 మధ్య ఆధార్ పొందిన వారు సవరణలు చేసుకోకపోవడంతో పాటు ఆగస్టు లోగా ఆధార్ అప్‌డేట్ చేసుకోపోతే ఆధార్ కార్డు సర్వీసులు నిలివేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆధార్‌తో లింక్ ఉన్న సర్వీసులు నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్, రేషన్ వంటి అన్ని రకాల సేవలు నిలిచిపోతాయి. ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆధార్‌కేంద్రంలో రూ.50 ఫీజుతో ఆధార్ అప్‌డేట్ చేస్తారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకున్న



నేను 2010లో ఆధార్ కార్డు తీసుకున్నా. అప్పటి నుంచి ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించలేదు. మొదట్లో తీసిన వారు అప్‌డేట్ చేయించాలి. మా గ్రామంలో క్యాంపు పెడితే నేను బ్యాంకు ఖాతా, ఓటు కార్డుతో ఆధార్ అప్‌డేట్ చేసుకున్నా. – కారంపూరి భూలక్ష్మి, బూర్గుపల్లి

నాలుగు గ్రామాల్లో క్యాంపులు



2010–2016 మధ్యలో ఆధార్ కార్డులు పొందిన వారు ఇపుడు అప్‌డేట్ చేసుకోవాలి. అప్‌డేట్ కోసం ఇప్పటికే మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రత్యే క్యాంపులు ఏర్పాటు చేశాం. సుమారు 600 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకున్నారు. – సుంచు ఆదిత్య, ఆధార్ సెంటర్, బోయినపల్లి

ఆగస్టులోగా అప్‌డేట్ చేయాలి



2010 నుంచి 2016 వరకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే ఆధార్ కార్డు ఇచ్చారు. దీంతో ఎన్నో బోగస్ కార్డులు ఉన్నాయి. అప్‌డేట్‌తో బోగస్ కార్డుల ఏరివేతతో పాటు సవరణలు చేసుకోవచ్చు. ఆగస్టులోగా అప్‌డేట్ చేసుకోవాలి. – మహేశ్, టీఎస్ ఆధార్, మీసేవా జిల్లా మేనేజర్

మహిళా సంఘ భవనం ఎక్కడుంది?

- మంత్రి కేటీఆర్ ప్రసంగంపై మహిళల నిరసన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారంలో సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన ముగించుకొని వెళ్లిన అనంతరం మహిళలు నిరసన తెలిపారు. గ్రామంలో మహిళాసంఘ భవనంతోపాటు ప్రగతి ప్రాంగణం ఇతర అభివృద్ధి పనులు చేసినట్లు మంత్రి మాట్లాడారు. మంత్రి సభ కొనసాగినంతసేపు ఎలాంటి ఆందోళన చేయని మహిళలు మంత్రి వెళ్లిన తర్వాత స్థానిక నాయకులతో వాగ్వాదానికి దిగారు. మంత్రి మాట్లాడిన అభివృద్ధి పనులన్నీ గ్రామంలో జరుగలేదని నిలదీశారు. మంత్రి ఉన్నప్పుడే ఈ విషయాలు అడగాల్సిందని స్థానిక నాయకులు మహిళలకు చెప్పారు. మొత్తంగా మంత్రి అభివృద్ధి మాటలపై మహిళల నిరసన చర్చనీయాంశంగా మారింది.


గుండారంలో నిరసన తెలుపుతున్న మహిళలు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటివెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని మల్కపేటలో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరె లత, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, ఆరె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు పూర్తయ్యేదెప్పుడు.?


రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి వద్ద జరుగుతున్న రిజర్వాయర్ పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. నియోజకవర్గానికి ఎల్లంపల్లి నీటి ద్వారా 55 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెబుతున్న అధికార పార్టీ నాయకులు అబద్ధాలతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. మర్రిపల్లి ప్రాజెక్టు, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, కలికోట, బీమారం, మేడిపల్లి మండలాలకు చుక్క నీరు రాలేదని వాపోయారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం వేములవాడ మండలంలో 10 వేల ఎకరాలకు, చందుర్తి మండలంలో 14 వేల ఎకరాలకు మాత్రమే నీరందుతుందన్నారు. నెల రోజుల్లో మర్రిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని లేకపోతే పార్టీ తరుపున రైతులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఎదురుగట్ల సర్పంచ్ సోయినేని కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, బత్తిని ఎల్లగౌడ్, మానుపాటి పర్శరాములు, జాగిరి సురేశ్, రొండి రాజు, శ్రీనివాస్, సాయి, మల్లేశం, సల్ల సురేష్, బండ శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పట్టిక శ్రీనివాస్‌రెడ్డి, దాన వేణు, చిలుక ప్రభాకర్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తేనే విజయం

- 'బలగం' చిత్ర దర్శకుడు వెల్దండి వేణు


వేణును సన్మానిస్తున్న కళాశాల నిర్వాహకులు

సిరిసిల్ల కల్చరల్: ఓటమిని అదృష్టంగా భావించాలని, పట్టుదలతో శ్రమిస్తేనే విజయం సొంతమవుతుందని 'బలగం' చిత్ర దర్శకుడు వేణు వెల్దండి వేణు అన్నారు. సోమవారం స్థానిక సిరిసిల్ల ఫంక్షన్ హాల్‌లో జరిగిన అయ్యప్ప డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తర్వాత బలగంతో అందుకున్న విజయం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. సినిమా రంగంలో తాను ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావించారు. బలగం చిత్రానికి లభిస్తున్న ప్రజాదరణకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెపెల్లి కృష్ణ, ప్రముఖ పాత్రికేయుడు బాలు, ఆకునూరి దేవయ్య తదితరులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాల నిర్వాహకులు వొడ్నాల శ్రీనివాస్, రేశం శ్రీకాంత్, నేరెళ్ల రమేశ్ వేణును ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో ఒగ్గు శివకుమార్‌కు చెందిన ఇంటి పైకప్పు కూలగా త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. శివకుమార్ భార్య, తల్లి ఎల్లవ్వతో కలిసి నివాసముంటున్నారు. సోమవారం వారి పిల్లలు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది. దీంతో వారి ఎల్లవ్వ వద్దకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఉపసర్పంచ్ ఒగ్గు రజిత ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

సౌదీలో సిరికొండ వాసి మృతి


సంజీవ్ (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన దండిక సంజీవ్ (35) సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవ్ ఎనిమిదేళ్లుగా సౌదీ అరేబియాకు వెళ్లి వస్తున్నాడు. సౌదీలోని దమామ్ పట్టణంలో కార్మికుడిగా పనిచేసేవాడు. మూడునెలల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. రోజుమాదిరిగా సోమవారం విధులకు వెళ్లగా గుండెలో నొప్పి ఉందని మిత్రులకు తెలిపాడు. వారు ఆస్పత్రి తరలించేలోపు మృతిచెందాడు. అనంతరం వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఫొటో దిగుతారా.. రూ.500 ఇవ్వాల్సిందే..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో సోమవారం పర్యటించిన మంత్రి కేటీఆర్ కాసేపు విద్యార్థులతో సరదాగా గడిపారు. పిల్లలు మంత్రితో ఫొటో దిగుతామని కోరగానే.. ఫొటో దిగితే రూ.500 ఖర్చు అవుతుందంటూ చమత్కరించారు. దీంతో అక్కడే నాయకులు అందరూ నవ్వారు. చివరికి పిల్లలతో ఫొటో దిగి వారిని సంతోషపర్చారు.

కార్మికుల సంక్షేమమే బీఎంఎస్ లక్ష్యం



పాట్నా ర్యాలీలో పాల్గొన్న జిల్లా బీఎంఎస్ అధ్యక్షుడు ధర్మేందర్

ముస్తాబాద్ (సిరిసిల్ల): దేశంలో కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం భారతీయ మజ్దూర్ యూనియన్ కృషి చేస్తోందని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ అన్నారు. బీహర్ రాష్ట్ర రాజధాని పాట్నాలో 20వ బీఎంఎస్ జాతీయ సమావేశాలు సోమవారం ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. సమావేశాలకు తెలంగాణ బీఎంఎస్ నాయకులు హాజరైనట్లు పేర్కొన్నారు. బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయి పాండ్య అధ్యక్షతన నాలుగు రోజులపాటు పాట్నా వేదికగా సమావేశాలు జరుగుతాయని, జాతీయ ఉపాధ్యక్షుడు నీతా, జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్ర హింతె పాల్గొన్నారని తెలిపారు.

జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు


జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పబ్బ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా సందుపట్ల రాజిరెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రహారం జోడాంజనేయ స్వామి ఆలయంలో సమావేశమైన జిల్లా రా రైస్‌మిల్లర్స్ ఈ మేరకు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వెన్నమనేని వంశీకృష్ణారావు, పురం సత్యంరావు, కార్యదర్శిగా బందం వెంకటేశం, సహాయ కార్యదర్శిగా నగునూరి శ్రీకాంత్, కోశాధికారిగా చేపూరి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా గర్రెపల్లి ప్రభాకర్, పురం అనిల్‌రావు, ముఖ్యసలహాదారులుగా చేపూరి అంజన్న, చీకోటి అశోక్, పప్పుల కిష్టయ్య, అనంతుల శ్రీనివాస్, గబ్బుల లక్ష్మీపతి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాలపరిమితితో పనిచేస్తుందని ప్రకటించారు.

3,445 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల : జిల్లాలో సోమవారం కంటి వెలుగులో భాగంగా 3445 మందికి కంటి పరీక్షలు చేశారు. జిల్లాలో 51 రోజులుగా 1,88,976 మందికి కంటి పరీక్షలు చేశారు.198 మంది సిబ్బంది వైద్యశిబిరాల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : మండలంలోని పద్మనగర్ గ్రామశివారు ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన టీకు మల్లేశం (45) బద్దెనపల్లికి చెందిన బావ బాలయ్య ఇంటికి వచ్చాడు. సిరిసిల్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పద్మనగర్ గ్రామ శివారు ప్రధాన రహదారి వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ అర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. పదో తరగతి రెగ్యులర్, కంపార్ట్‌మెంటల్ ఉత్తీర్ణులు పాలిసెట్ 2023 ఆన్‌లైన్ ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష తేదీ మే 17న జరుగుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.